అంబేద్కర్‌కు సైకత నివాళి

ఈనెల 14వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలోని సంగమేశ్వర స్వామి కొండ దిగువన సైకత శిల్పి గేదెల హరికృష్ణ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సైకత శిల్పాన్ని చెక్కారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

ఆక్వాకు అమెరికా దెబ్బ

- సముద్ర ఉత్పత్తులపై అమెరికా 27 శాతం విదేశీ సుంకం
- ఊహించని రీతిలో పడిపోయిన ధరలు
- రూ.కోట్లలో నష్టపోతున్న ఆక్వా రైతులు

ప్రజాశక్తి - నౌపడ

రాష్ట్ర జిడిపిలో మత్స్య రంగం (ఆక్వాకల్చర్) కీలక భూమిక పోషిస్తుంది. జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న రొయ్యల పెంపకం రాష్ట్ర ఖజానాకు అధిక ఆదాయం సమకూరుస్తుంది. జిల్లాలోని సంతబొమ్మాళి, గార, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల, రణస్థలం, పోలాకి మండలాల్లో విస్తారంగా రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. ఇటీవలే వనామీ రొయ్యల ధరలు పెరగడంతో ఆనందం వ్యక్తం చేసిన రైతులు, వచ్చే ఆదాయంతో అప్పులు తీరుతాయనే భావించారు. కానీ ఆక్వా రైతులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రూపంలో అనుకోని దెబ్బ ఎదురైంది. భారతదేశం నుంచి వెళ్లే సముద్ర ఉత్పత్తులపై అమెరికా 27 శాతం దిగుమతి సుంకం విధించారు. దీంతో రొయ్యల వ్యాపారులు అమాంతం ధరలు తగ్గించేశారు. ట్రంప్ పేరు చెప్పి సిండికేట్‌గా ఏర్పడి ఇష్టానుసారం ధరలను కుదించేయడంతో రైతులకు రూ.కోట్లలో నష్టపోయే పరిస్థితి దాపురించింది.

అమాంతంగా ధరల పతనం

జిల్లాలో సుమారు నాలుగు వేల హెక్టార్లలో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. సుమారు 1500 మంది రైతులు ఆక్వాపై ఆధారపడుతుండగా, వీరిలో అధిక శాతం మంది కౌలు రైతులు. సుమారు పదివేల మంది ఆక్వా కార్మికులు ఆక్వా పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. టైగర్, వనామి వంటి రొయ్యల సాగుతో రూ.200 కోట్లకు పైగా ఆదాయంతో వ్యాపారం సాగుతోంది. ప్రతికూల వాతావరణం, వైరల్ ఇన్ఫెక్షన్ ప్రభావంతో పలువురు రైతులు ఒడిదుడుకులు ఎదురై మూడేళ్లుగా సాగుకు దూరమయ్యారు. ఆక్వాకల్చర్‌కు విద్యుత్ ధర యూనిట్‌కు రూ.2 ఉండగా, గత వైసిపి ప్రభుత్వం దాన్ని ఆక్వా, నాన్ ఆక్వా జోన్లుగా విడదీసింది. దీంతో సుమారు 60 శాతం మంది రైతులకు విద్యుత్ రాయితీలు కోల్పోయారు. ఆక్వా సాగును ప్రోత్సహించేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆక్వారంగానికి యూనిట్‌కు రూ.1.50 ఇచ్చి రాయితీ ఇస్తోంది. దీంతో ఆసక్తిగా సాగు చేసేందుకు ముందుకు వచ్చిన రైతులు, పడిపోయిన ధరలతో ఊహించని రీతిలో నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతానికి వంద కౌంట్ రొయ్యల ధర 240 నుంచి నాణ్యత బట్టి రూ.175 నుంచి రూ.200కు పడిపోయింది. 50 కౌంట్ రొయ్యల ధర 380 నుంచి రూ.310కు పడిపోయింది. అమాంతం పడిపోయిన రొయ్యల ధరలతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు ఇప్పటికే ఆర్డర్ల ద్వారా సేకరించిన రొయ్యల ఉత్పత్తులు పోర్టుల్లో, కోల్డ్ స్టోరేజీల్లో ఎగుమతులకు సిద్ధం చేసుకోగా, అధిక సుంకాల భారం వీటి పైనా పడడంతో వ్యాపారులు కూడా కొనుగోలు ఆపేశారు. రొయ్యల ఉత్పత్తిలో అధిక పెట్టుబడి పెట్టి అకస్మాత్తుగా ధరలు పడిపోవడం, అమ్మకాలు నిలిచిపోవడంతో రైతులు గందరగోళానికి లోనవుతున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

నౌపడలో ఆక్వా రైతులు పండించిన రొయ్యలు

మత్స్యరంగంలో ఎందుకు ఈ సంక్షోభం?

ఆక్వా కల్చర్‌కు ఇటువంటి సంక్షోభాలు కొత్తవి కాదు. ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలు, ప్రతికూల వాతావరణాలతో నిత్యం ఏదో ఒక సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే ఈసారి భారత్ నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం 27 శాతం దిగుమతి సుంకం విధించింది. 2023-24లో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలో రొయ్యలే 92 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అమెరికాకు రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారత్‌పై 27 శాతం దిగుమతి సుంకం విధించిన కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతోంది. దక్షిణ అమెరికాలోని ఈక్వెడార్ ప్రాంతాల నుంచి ఎగుమతిదారులపై 10 శాతం పన్ను మాత్రమే అమెరికా విధిస్తోంది. ఇది మన దేశానికి పరోక్షంగా నష్టం చేస్తూ, వారికి అనుకూలంగా మారుతుంది. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే 5.77 శాతం కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ భారాన్ని మోస్తున్నారు. అన్ని సుంకాలు కలుపుకుంటే ఈక్వెడార్‌కు, భారత్‌కు మధ్య సుంకాల వ్యత్యాసం సుమారు 20 శాతం ఉంటుంది. ఈ కారణంగా అమెరికాకు వెళ్లే అన్ని ఎగుమతుల పైన ఈ భారం పడుతుంది. యూరోపియన్ యూనియన్‌లో భారత ఎగుమతిదారులు 50 శాతం తనిఖీ రేట్లు, 4 నుంచి 7 శాతం దిగుమతి సుంకంతో సహా నాన్ టారిఫ్ అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. వియత్నాం వంటి దేశాలు ఇయుతో స్వేచ్ఛ, వాణిజ్య ఒప్పందం (ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్) కింద జీరో డ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్‌ను సమర్థవంతంగా ఆక్రమిస్తున్నాయి. వియత్నాం, థాయిలాండ్, జపాన్ మార్కెట్లు భారత్ నుంచి సీ ఫుడ్‌ను కొనుగోలు చేసి, వాటిని ప్రాసెస్ చేసి, అమెరికాకు ఎగుమతి చేస్తాయి. ప్రస్తుతం తుది ఉత్పత్తులపై విధించిన అధిక ట్యాక్స్‌ల కారణంగా ఆ దేశాలు కూడా మనకు ఇచ్చిన ఆర్డర్లను రద్దు చేస్తున్నాయి. రాష్ట్రంలో శీతల గిడ్డంగులు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంట ఎక్కడ ఉంచాలో తెలియని గందరగోళ పరిస్థితుల్లో రైతాంగం ఉంది. 27 శాతం సుంకాల కారణంగా రైతులు సాగు చేసిన రొయ్యలను సొమ్ము చేసేందుకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సంక్షోభం నివారించాలంటే కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకొని అమెరికాతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం పరిష్కార చర్యలు చేపట్టాలి

అమెరికా నిర్ణయాలతో ఆక్వా రంగం ఎదుర్కోనున్న ఇబ్బందులపై కేంద్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కార మార్గాలు చేపట్టాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆక్వా సమస్యపై లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం, అక్కడితో పరిమితం కాకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక వ్యాపారులను, క్షేత్రస్థాయిలో కంపెనీ ప్రతినిధులను భాగస్వాములు చేసి ఆక్వా రంగం పురోగమనానికి చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. భారత్ నుంచి వేరే దేశాలకు ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరుతున్నారు.

రూ.లక్షల్లో నష్టపోతాను

నేను 50 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నాను. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో సాగుతో పాటు ధరలు ఆశాజనకంగా ఉండడంతో లాభాలు వస్తాయని ఆశించాను. ప్రస్తుతం నా దగ్గర 115 టన్నులకు పైగా సరుకు ఉంది. అమెరికా విధించిన సుంకాలతో సరుకు అమ్ముకునేందుకు ఇబ్బందులు తలెత్తాయి. సరుకు వెళ్లకపోతే రూ.50 లక్షల వరకు ఆదాయం నష్టపోవాల్సి వస్తోంది. ఈ సంక్షోభం సాగుదారుల పైనే కాదు, ఈ రంగంపై ఆధారపడిన కూలీలపైనా ప్రభావం పడింది. ప్రభుత్వం సత్వరమే పరిష్కార మార్గాలను చూపించాలి.

- పడాల గంగిరెడ్డి
ఆక్వా రైతు (నౌపడ)

సమావేశంలో మాట్లాడుతున్న ఎం.వి.ఎస్ శర్మ

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ అభివృద్ధి

మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - మందస

శాస్త్రీయ దృక్పథం ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. మండలంలోని హరిపురంలో ప్రజా విజ్ఞాన వేదిక నాయకులు మార్పు జగన్మోహన్‌రావు అధ్యక్షతన ఆదివారం విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి మూఢనమ్మకాలు ఆటంకమమన్నారు. అశాస్త్రీయ భావనలు, మూఢనమ్మకాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజా సైన్స్ ఉద్యమాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమాజంలో మూఢనమ్మకాలను విజ్ఞానం, చైతన్యం కల్పించడం ద్వారా పారదోలవచ్చని చెప్పారు. ప్రతిఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రజా విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ జీవ పరిణామ క్రమాన్ని వివరించారు. శాస్త్రీయ ఆలోచన, దక్పథం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు దాసరి ఈశ్వరరావు, మామిడి కోదండరావు, నల్ల హడ్డి, పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవపరిణామ క్రమం- జీవితచరిత్ర అనే అంశంపైన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి హరిపురం గీతం టాలెంట్ స్కూల్ విద్యార్థి బి.గీత, బహడపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థి కె.కరిష్మా ద్వితీయ బహుమతి, హరిపురం జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థి ప్రణీత తృతీయ, కొత్తపల్లి కీర్తన, సాలిన సాయిశ్రీ, చరిణా యాదవ్, కోకిక బి.ప్రవీన్‌లు ప్రోత్సాహక బహుమతులు గెలుపొందారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

షెడ్యూల్డ్ కులాలకు రూ.18.74 కోట్ల రుణాలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 షెడ్యూల్డ్ కులాల వార్షిక ప్లాన్ అమల్లో భాగంగా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి రూ.18.74 కోట్ల రుణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 450 మంది లబ్ధిదారులకు రూ.18.74 కోట్ల రుణాలను మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో బ్యాంకుల ద్వారా రూ.10.40 కోట్లు, ప్రభుత్వ రాయితీ రూ.7.40 కోట్లు, లబ్ధిదారుల వాటా రూ.93.74 లక్షలు ఉంటాయని తెలిపారు. ఈ పథకం కింద ట్రాన్స్‌పోర్టు రంగంలో 137 మందికి, పారిశ్రామిక, సేవా, వ్యాపార రంగాల్లో 309 మందికి, వ్యవసాయ రంగంలో నలుగురికి రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 14 నుంచి వచ్చే నెల పదో తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వయో పరిమితి 21 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు తప్పనిసరి అని తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ రంగానికి దరఖాస్తు చేసుకునే వారికి డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జి తప్పక ఉండాలన్నారు. రేషన్ కార్డుపై ఒకరికి మాత్రమే లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేవారు https://apobmms.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో వెబ్‌సైట్‌లో వివరాల నమోదు తర్వాత ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజల కష్టాలపై కవులు స్పందించాలి

సమతా భారత్ కవితా గోష్టిలో వక్తలు

మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయ్‌కిరణ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

దేశంలో అరాచక ఫాసిస్టు మూకలు రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని, ఈ దశలో అంబేద్కర్ ఆశయాలను భుజానకెత్తుకుని ప్రజానీకం ఐక్యంగా ముందుకు సాగాలని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సాహితీ స్రవంతి శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యాన సమతా భారత్ కవితా గోష్టిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల నుంచి వారి దృష్టిని అప్రధాన విషయాల వైపు మళ్లిస్తూ కార్పొరేట్లకు సంపదనంతా పాలకులు దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రజల అసలు సమస్యలను కవులు తమ కవితల రూపంలో స్పందించి ప్రజలను జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఉదయ్ కిరణ్ త్రిభాష సూత్రం - మాతృ భాష అనే అంశంపై ప్రసంగించారు. నూతన విద్యా విధానం 2020 ద్వారా కేంద్ర ప్రభుత్వం హిందీ భాషని దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తోందన్నారు. మాతృభాషలో విద్యాబోధన విద్యార్థి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఇతర భాషలు నేర్చుకోవడం ఐచ్ఛికమని తెలిపారు. కొఠారి కమిషన్ హిందీ భాషను అనుసంధాన భాషగా అభివృద్ధి చేసేలా ఆలోచించాలని మాత్రమే చెప్పిందన్నారు. సభాధ్యక్షులు, సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు మాట్లాడుతూ దేశంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నిరుద్యోగం, ధరలు, అసమానతలు, వ్యవసాయ సంక్షోభం తాగునీటి సమస్య, సాగునీటి కొరత, భూముల కార్పొరేటీ కరణ, ప్రజాస్వామ్య హక్కుల అణచివేత, మత విద్వేషం, కుల దురహంకారం పెరుగుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో అంబేద్కర్ ఆశయాలు, స్వాతంత్రోద్యమ లక్ష్యాలు నీరుగారిపోకుండా గళమెత్తి కలాలకు పదును పెట్టాలని పిలుపునిచ్చారు. కవితా గోష్టిలో ప్రముఖ కవులు కంచరాన భుజంగరావు, కుప్పిలి వెంకట రాజారావు, కలమట దాసుబాబు, తంగి ఎర్రమ్మ, బాడాల శ్యామలరావు, నెత్తిమి రమణ, పూజారి దివాకర్, డాక్టర్ గుంట లీలా ప్రసాద్, పత్తి సుమతి, రౌతు ధనలక్ష్మి, క్రాంతి, డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ పి.ముకుందరావు స్వీయ కవితలను గానం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు.

75 ఏళ్ల శ్రీకాకుళం చరిత్ర గ్రంథస్తం

ఇంటాక్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నాటికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా చరిత్ర, సంస్కృతులకు సంబంధించి వ్యాస సంపుటిని తీసుకురావాలని ఇంటాక్ సమావేశంలో తీర్మానించారు. నగరంలోని రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో ఇంటాక్ కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చరిత్ర, సంస్కృతి వ్యాసాల సంకలనాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడానికి మరిన్ని సూచనలను స్వీకరిస్తామన్నారు. ఇంటాక్ కో-కన్వీనర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న రచయితలు, పలు రంగాల్లో అనుభవం గల వారితో వ్యాసాలను రాయించాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో సమావేశమైన తర్వాత ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథం నాయుడు

సమావేశానికి హాజరైన సభ్యులు గ్రంథ రచనకు అవసరమైన సూచనలు చేశారు. సమావేశంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి పి.జగన్మోహనరావు, జర్నలిస్ట్, చరిత్ర పరిశోధకులు నల్లి ధర్మారావు, విశ్రాంత ప్రిన్సిపల్ సనపల ఈశ్వరరావు, విద్యావేత్త డాక్టర్ నిక్కు అప్పన్న, నామ శాస్త్ర పరిశోధకులు వాండ్రంగి కొండలరావు, డిగ్రీ కళాశాల లెక్చరర్ బెందాళం వరలక్ష్మి, రంగస్థల కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు ఎల్.రామలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో ఆంగ్ల మాధ్యమంలో పరీక్ష నిర్వహించారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 1261 మంది దరఖాస్తు చేసుకోగా 84.29 శాతం (1063 మంది) హాజరయ్యారు. 198 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షకు 1318 మంది దరఖాస్తు చేసుకోగా 86.64 శాతం (1142 మంది) విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు 176 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ నాయక్ తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు రాష్ట్ర పరిశీలకులు డి.వామనమూర్తి పెద్దపాడు, ఎచ్చెర్ల, తామరాపల్లి, దుప్పలవలసలోని పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, మజ్జిగ అందుబాటులో ఉంచారు.

ఆవుల మరణాలపై అసత్య ప్రచారాలు

ప్రజాశక్తి- కవిటి, శ్రీకాకుళం

గో మరణాలపై టిడిపి మాజీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విప్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే నగరంలోని విశాఖ-ఎ కాలనీలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. టిటిడి గోశాల్లో వంద గోవులు మరణించాయని కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణ పూర్తి అసత్యమని అన్నారు. గత రికార్డులు పరిశీలిస్తే వాస్తవాలు కళ్లకు కనబడతాయని తెలిపారు. కరుణాకర్ రెడ్డి తన హయాంలో జరిగిన అక్రమాలపై ఒకసారి దృష్టి సారించాలని సూచించారు. పాత ఫొటోలను చూపుతూ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా విష ప్రచారాన్ని ఆపకపోతే ప్రజలు క్షమించరన్నారు. గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు గోవుల సంరక్షణ చేపడుతున్నారని, అందులో 2,668 ఆవులకు జియోట్యాగ్ చేసి ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు తీరు మార్చుకోవాలని ఆయన సూచించారు.

శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం: శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్, ఎస్ఎస్ఆర్ సంయుక్త ఆధ్వర్యాన నగరంలో చేపట్టిన శాఖాహార ర్యాలీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అలాగే సాంప్రదాయ గురుకులం విద్యార్థులు అందించిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ

- శతశాతం పన్నుల వసూళ్లపై దృష్టి
- నగర సుందరీకరణ పనులు ప్రారంభం
- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరపాలక సంస్థ పరిధిలో శతశాతం పన్నుల వసూళ్లపై దృష్టి సారించామని, పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగ పరచుకుని ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డి.వి.వి.ఎస్.ప్రసాదరావు అన్నారు. ప్రస్తుతం పన్నులపై 50 వడ్డీ రాయితీతో పాటు 5 శాతం పన్ను రాయితీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు ఈ నెలఖరులోగా సద్వినియోగపరచుకోవాలన్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ పరిధిలో రూ.20 కోట్లకు పైగా పన్నులు వసూలు చేశామని తెలిపారు. మిగిలిన పన్ను బకాయిలను త్వరితగతిన చెల్లించి సహకరించాలని కోరారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో తాగునీరు వృథా చేయొద్దని కోరారు. ఎక్కడైనా నీటి వృతా అవుతున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. కాలువల్లో పూడికతీత పనులు పెద్దఎత్తున చేట్టామన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

? పన్నుల బకాయిల వసూళ్లపై చర్యలు ఏమిటి?

నగరపాలక సంస్థ పరిధిలో ఏటా రూ.30 కోట్ల వరకు ఇంటి పన్ను, కుళాయి, ఖాళీ ప్రదేశాల పన్నులు చెల్లించాల్సి ఉంది. వీటితో పాటు రూ.10 కోట్లు పైన పాత బకాయిలు నిలిచిపోయి ఉన్నాయి. వీటిని వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికే 50 శాతం వడ్డీ రాయితీని ప్రకటించింది. మార్చి నెలాఖరు వరకు గడువు నిర్ణయించి బకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం. అదనంగా ఈ నెలాఖరు వరకూ పన్నులు చెల్లింపుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అందులో భాగంగానే నగరపాలక సంస్థ పరిధిలో రూ.20 కోట్లకు పైగా పన్నుల వసూలు పూర్తిచేశాం. అయితే మిగిలిన బకాయిలను వసూలు చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఈ రాయితీని ఏప్రిల్ చివరి వరకు పొడిగించింది. దీనికి తోడు పన్నులపై 5 శాతం రాయితీని ప్రకటించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాం. సెలవు రోజుల్లో సైతం కౌంటర్లను నిర్వహించి పన్నులు చెల్లించుకునేందుకు వీలు కల్పించాం. దీంతో కొందరు ముందుకొచ్చి పన్నులు చెల్లించి రాయితీలను పొందగలుగుతున్నారు. ఈ నెలాఖరులోగా శతశాతం పన్నుల వసూళ్లను లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు సహకరించాలని కోరుతున్నాం.

? వేసవి దృష్ట్యా తాగునీటి పరిస్థితి ఎలా ఉంది?

వేసవి కారణంగా నగర వాసులకు ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు ప్రారంబించాం. నాగావళి నదిలో తాగునీటి బావుల వద్ద నీరు లభ్యత ఆధారంగా నీటి సరఫరా అవుతుంది. నగర వాసులకు రెండు పూటలా తాగునీరు అందిస్తున్నాం. కలుషిత నీరు నదిలో కలిసే ప్రాంతాల్లో అడ్డుకట్ట వేసి బావుల దరి చేరకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నాం.



బావులకు సమీపాన ఇసుక తవ్వకాలు జరపకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. దీనివల్ల నీటి లభ్యత ఈ ఏడాది పుష్కలంగానే ఉంది. విద్యుత్ పంపుహౌస్‌ల్లో సరఫరా నిరంతరాయంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైన ఆసాంకేతిక సమస్య తలెత్తినా 24 గంటల వ్యవధిలో మరమ్మతులు చేయగల సామర్థ్యం నగరపాలక సంస్థ వద్ద ఉండడం వల్ల యంత్రాంగం ఆ దిశగా కట్టుదట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రెండు పూటలా నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోంది.

? నగర సుందరీకరణ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?

నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి వీలుగా నగర సుందరీకరణ పనులు ప్రారంభించాం. ఇది నిరంతర ప్రక్రియ. అవసరం ఉన్న ప్రతి పనికీ నిధులు కేటాయించి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నగరంలోని అరసవల్లి రోడ్డు, కళింగ రోడ్డు విద్యుద్దీకరణ, సెంటర్ డివైడర్ నిర్మాణం చేపట్టాం. అలాగే పాలకొండ రోడ్డులోని చెట్లను తొలగించి సెంటర్ డివైడరును పునర్నిర్మించి విద్యాద్దీకరణ చేపట్టాం. నగరంలో గూనపాలెం, ఎల్‌బిఎస్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, హడ్కో కాలనీ, అఫీషియల్ కాలనీ పార్కు, గాంధీ పార్కు, రివర్ వ్యూ పార్కు, కార్గిల్ పార్కులను అభివృద్ధి చేశాం. పార్కుల పరిరక్షణ స్థానికులే పర్యవేక్షించుకునేలా చర్యలు చేపట్టాం.

? అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నగరపాలక సంస్థకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న భవన నిర్మాణ రంగంలో ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా కట్టడాలు చేపడితే అనుమతులు ఇస్తున్నాం. ప్రభుత్వ నిబంధనలను విస్మరించి నిర్మిస్తే చర్యలు తప్పవు. భవన నిర్మాణాలపై పురపాలకశాఖ కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. తమ పరిధిలోని భవనాలను సచివాలయాల ప్రణాళిక కార్యదర్శులు చిత్రాలు తీసి అప్‌లోడ్ చేస్తే ఉన్నతాధికారుల పర్యవేక్షణలో చర్యలు మొదలు పెడతారు. అనుమతుల్లేని నిర్మాణాలతో పాటు, తీసుకున్న అనుమతులకు భిన్నంగా కట్టడాలు ఉన్నా వాటిని గుర్తించి చర్యలు చేపట్టేందుకు వీలుగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పర్యవేక్షణకు నిశిత పరిశీలనకు అవకాశాలు మెరుగుపడ్డాయి. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేసేందుకు పురపాలకశాఖ అనథరైజ్డ్ కన్‌స్ట్రక్షన్స్ ఐడెంటిఫికేషన్ అండ్ మానిటరింగ్ సిస్టం (యుసిఐఎంఎస్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం. భవనాలు, బహుళ అంతస్తుల సముదాయాలను యాప్‌లో పొందుపర్చే ప్రక్రియ కొన సాగుతోంది.

దగ్ధమైన తోటను చూపిస్తున్న రైతు

నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జి.సిగడాం మండలంలో సేతు భీమవరానికి చెందిన జీడి, మామిడి తోటలో అగ్నిప్రమాదంలో కాలిపోయిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో సేతు భీమవరంలో గత ఐదు రోజుల క్రితం కాలిపోయిన తోటలను సందర్శించారు. ఆరున్నర ఎకరాల తోట పూర్తిగా కాలిపోయిందని నిర్ధారించారు. బొల్లి రమణ, బొల్లి కామయసూరి, సాకబత్తుల రమణ, సాకబత్తుల అప్పారావు, గొర్ల కామయ్య, గెడ్డ అప్పారావు, గెడ్డ కందరాసికి చెందిన రైతులు ఉన్నారన్నారు. చేతికి వచ్చిన పంట పూర్తిగా నాశనమైందని, ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పూర్తి నష్టపరిహారాన్ని ఎకరాకు రూ.70 వేలు ఇవ్వాలని, కాలిపోయిన మొక్కల స్థానంలో ఉద్యానశాఖ జీడి, మామిడి మొక్కలు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తునన వైసిపి నాయకులు

కంకర తవ్వకాలు ఆపాలి

పలాస : కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో కంకర తవ్వకాలు చేపడుతున్నారని, తక్షణమే తవ్వకాలు ఆపాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు, 19 వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్టు గోపి కోరారు. కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంకర తవ్వకాలు చేపట్టడం ద్వారా భవిష్యత్‌లో భూగర్భ జలాలు అడుగంటి తాగునీరు ఉండే పరిస్థితి ఉండదన్నారు. పర్యావరణం ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. స్థానిక ప్రజలు కంకర తవ్వకాలు ఆపాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంకర తవ్వకాలు ఆపాలని కోరుతున్నారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో బి.సింహాచలం, దాసరి శంకరరావు, లండ దానేష్, కొనారి ఆది, కె.నూకరాజు, ఎ.రమేష్, ఎస్.లోకేష్ పాల్గొన్నారు.

అభినందిస్తున్న డైరెక్టర్ గణపతిరావు

'సంపత్ సాయి' విజయదుందుభి

ప్రజాశక్తి- నరసన్నపేట

ఇంటర్మీడియట్ ఫలితాల్లో నరసన్నపేట సంపత్ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ఈ మేరకు కళాశాలలో విద్యార్థుల అభినందన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గణపతిరావు మాట్లాడుతూ ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థుల్లో ప్రథమ సంవత్సరం ఇంటర్ ఎంపిసిలో సూరపు శ్రావణి, పల్ల రవివర్మలు 464 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో దూడ భారతి 988, బైపిసిలో తర్ర స్రవంతి 988 మార్కులు సాధించి సత్తాచాటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్‌కు ధీటుగా ఫలితాలు సాధించడం సంపత్‌సాయి జూనియర్ కళాశాలకే సొంతమన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానించారు. కార్యక్రమంలో యాజమాన్యం వెలమలు భాస్కరరావు, రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కవిటి: కవిటి కళ్యాణి జూనియర్ కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్ల రాజేష్ అభినందించారు. ఆదివారం విద్యార్థులకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థితిలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నీలగిరి మాటున టేకు తరలింపు

- ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న విలువైన కలప
- మామ్ముళ్ల మత్తులో అటవీ శాఖాధికారులు

ప్రజాశక్తి- లావేరు

పేరుకేమో నీలగిరి కర్రలు లోపల మాత్రం లక్షల విలువ చేసే విలువైన అకేషియా, టేకు కలపను దర్జాగా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిపోతోంది. పట్టపగలే జాతీయ రహదారిపైనే ఈ తతంగమంతా జరుగుతున్నా కనీసం అటవీ శాఖాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు సరికదా వారు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శ ప్రజల్లో బలంగా సాగుతోంది. అక్రమ కలప రవాణాకు మండలం వేదికైంది. మండలంలోని బెజ్జిపురం పంచాయతీ బొంతుపేట వద్ద కనక మహాలక్ష్మి వేబ్రిడ్జి, శివజ్యోతి వేబ్రిడ్జి, బోరపేట వద్ద నున్న షిర్డీసాయి వేబ్రిడ్జి, కర్రల డిపోల వద్ద విలువైన అకేశ్, టేకు కలప నీలగిరి కర్రలు మాటున తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాయపూర్, భద్రాచలం తదితర ప్రాంతాలకు యథేచ్ఛగా స్మగ్లింగ్ జరుగుతుంది. ముందుగా హైవేకు దగ్గరలోనే ప్రకృతి లేవుట్ గుమ్మడి రోడ్డులో విలువైన కలప లారీల్లో కేబిన్ లెవెల్ వరకు ఎక్కించి అక్కడ నుండి 5 నిమిషాల్లో వేబ్రిడ్జిల వద్దకు చేరుకొని లారీలోడు చేసేందుకు బయటకు ఒక కర్ర వరస చుట్టూ నీలగిరి కర్రలు పేర్చి లోపల అకేశ్ అప్పుడప్పుడు కొంత మేర టేకు కూడా లోపల పేర్చి తరలిస్తున్నారు. వేబ్రిడ్జి వద్ద లారీ కేబిన్ దాటి లోడింగ్ చేసే క్రమంలో అకేశియా తొక్క తొలగించి చూసే వారికి అనుమానం రాకుండా ఉండేందుకు ఏమార్చడానికి నీలగిరి కర్రలే అనుకునే విధంగా తొక్క తొలగిస్తున్నారు. ఇలా రోజూ ఇక్కడ నుంచి సుమారు ఐదు నుంచి ఎనిమిది లారీల్లో కలప తరలిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అదే జాతీయ రహదారిపై నుంచి జిల్లాస్థాయి అధికారులు, అటవీశాఖ, రెవెన్యూ అధికారులు వెళ్తున్న తనిఖీ చేసే దాఖలాలు లేవు. అక్రమ రవాణాదారులకు భయం కూడా లేదు. అటవీశాఖ అధికారుల కనుసన్నల్లోనే ఈ రవాణా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతుందని, వీరికి అటవీశాఖాధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని, వారికి నెలనెలా పెద్ద మొత్తంలో ముడుపులు ముడుతున్నట్లుగా పెద్దఎత్తున చర్చ జరుగుతుంది. రోజు ఇలా విలువైన కలప తమ కళ్లముందే తరలిపోతున్నా చూస్తూ ఉండిపోవాల్సి వస్తుందని ఆ గ్రామానికి చెందిన కొందరు చెబుతున్నారు. ఇక్కడ పేరుకే నీలగిరి, సరుగుడు, జీడి మామిడి కలపే రవాణా జరుగుతుందని అనుకుంటారని, వాటి మాటున విలువైన అకేశ్, టేకు వంటి విలువైన కలప అక్రమంగా రవాణా జరుగుతుండటంతో విషయం అధికారులు తెలుసుకోవడం లేదని ప్రజాశక్తి ముందు ఆవేదన చెందారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించాలని, అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేసి నివారించాలని వారంతా కోరుతున్నారు.

కనకమహాలక్ష్మి వేబ్రిడ్జి వద్ద అకేషియా కర్రలను లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు

షైనింగ్ స్టార్ అవార్డుకు ధరణి ఎంపిక

ప్రజాశక్తి- బూర్జ

స్వీట్ తినిపిస్తున్న తండ్రి జోగారావు

ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల విభాగంలో షైనింగ్ స్టార్ అవార్డుకు కర్ని ధరణి ఎంపికైనట్లు ఒవిపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో తమ ఆదర్శ పాఠశాల విద్యార్థిని ధరణి ఎంపిసిలో 984/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఆదర్శ పాఠశాల విభాగంలో అవార్డును కైవసం చేసుకుందన్నారు. పూండి సమీపంలోని ఉద్దానం గోపీనాథపురం గ్రామానికి చెందిన జోగారావు, వరలక్ష్మి దంపతుల రైతు కుటుంబంలో పుట్టి కృషి, పట్టుదలతో చదివి ఈ అవార్డును సాధించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 15న విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ధరణి ఈ అవార్డును అందుకోనుందని శ్రీనివాసరావు తెలిపారు. ధరణి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

పట్టని అధికారులు

ప్రజాశక్తి- మందస

మండలంలోని అంబుగాంలో ఉన్న చాకలి చెరువులో మట్టిని అక్రమంగా ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు తరలిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన కూటమి నేత అధికారుల కళ్లుకప్పి మజ్జిని ట్రాక్టర్లతో తేడేస్తున్నారు. మూడు వారాలుగా మట్టి తరలిపోతున్నా మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులకు తెలిసినా మౌనం వహిస్తున్నారు. కూటమి నాయకులు చుట్టుపక్కల చెరువుల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారు. వర్షాలు పడే సమయానికి చెరువులో నీరు కూడా నిలకడ లేకుండా గట్టులను సైతం మింగేస్తున్నారు. ఈ చెరువుల్లో వంద రోజులు పని చేయిస్తే... కూలీలకు పని దొరుకుతుంది... చెరువులూ సుందరంగా తయారవుతాయి. దీంతో అక్రమంగా మట్టి తరలిపోతుందని నిరాశ చెందుతున్నారు. గ్రామస్థాయి అధికారులను వివరణ కోరితే తమకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరుతున్నారు.

ప్రొక్లెయినర్‌తో చెరువులో తవ్వుతున్న మట్టి

రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కరువైందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం డిసిసిబి కాలనీలో రోడ్డు ఆక్రమణపై స్థానికులు చేపట్టిన ధర్నా శిబిరాన్ని వైసిపి నాయకులు చిట్టి జనార్ధనరావు, గొండు రఘురాం, అంబటి శ్రీనివాసరావులతో కలిసి సందర్శించారు. డిసిసిబి కాలనీలో గడచిన 20 రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖలు ఆక్రమణదారుల పక్షాన నిలిచి బాధితులకు న్యాయం చేయడం లేదన్నారు. అప్రూవుల్ లేఅవుట్‌లో రోడ్డు ఆక్రమణకు గురైతే కమిషనర్ ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ స్థలమని స్థానికులు ఫిర్యాదు చేసినా కలెక్టర్, కమిషనర్ ఇంత వరకు ఆప్రదేశాన్ని సందర్శించలేదన్నారు. గత 15 ఏళ్లుగా కార్పొరేషన్‌లో ఎన్నికలు జరగక పోవడంతో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

శిబిరం వద్ద మాట్లాడుతున్న వైసిపి నాయకులు

డిటిసిపి ఆప్రూవ్డ్ లే అవుట్‌లో ప్రభుత్వానికి అప్పగించిన స్థలాన్ని లే అవుట్ యజమాని ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. శిబిరం వద్ద కాంగ్రెస్ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ శిబిరంలో స్థానికులు బిర్లంగి రామ్మోహన్, బిందు కృష్ణ, జొడ్డు మహంతి, సంతోష్, గొప్పు సంతోష్, ఎయుఎస్ ప్రసాదరావు, భాగ్యలక్ష్మి, సనపల నర్సింగరావు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

ఒడియా విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- కవిటి

పరీక్షల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీసి తద్వారా ఒడియా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంఇఒ ధనుంజయ మజ్జి, అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దళాయి తెలిపారు. జిల్లాలో ఒడియా మాధ్యమం చదువుతున్న 5వ తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్ల అసోసియేషన్ (ఆపోటా) అధ్వర్యాన జిల్లాస్థాయి మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్ష మండలంలోని పెద్దమెళియాపుట్టుగ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. అపోటా సభ్యులు ఎస్.గోపాల్‌కృష్ణ, పురంధ్ర సవర, కె.ఆనంద్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పరీక్షలో 550 మంది ఒడియా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలో పెద్దఎర్ర గోవిందపుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన వై.హరికృష్ణ ప్రథమ స్థానం, ఆర్.అగ్రహారం ప్రాథమిక పాఠశాల విద్యార్థి ఆర్.ధనుంజయ ద్వితీయ స్థానం, చిన్నమిలియపుట్టుక ప్రాథమిక పాఠశాల విద్యార్థి జి.బాసంతు తృతీయ స్థానం సాధించారు. విజేతలకు ఎంఇఒ ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. కుసుంపురం ప్రాథమిక పాఠశాల ఒడియా ఉపాధ్యాయుని నల్లా సుజాత ఆర్థికసాయంతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి, ఎపి ఒడియా టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామహరిపాడి, ప్రధానోపాధ్యాయుడు ప్రసన్న లెమ్మాయి, ప్రమోద్‌కుమార్ పాడి, త్రిలోచన్ పొల్లాయి ఎస్.గోపాలకృష్ణ, కేశవపుర్య, మనోజ్ కుమార్ మహారాణ, కిరణ్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు.

సాహిత్య పథంలోకి యువత రావాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తెలుగు సాహిత్యం ఎంతో ప్రాచీనమైందని, దీనిని అంది పుచ్చుకునేందుకు యువత ముందుకు రావాలని తెలుగు రచయితల వేదిక అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరావు పిలుపునిచ్చారు. ఆదివానం నగరంలోని గూనపాలెం శాంతినికేతన్ కళాశాలలో తెరవే కవి సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి బగాది వెంకటరావు అధ్యక్షత వహించారు. 16 మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన కవితలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కనుగుల సత్యం (అంబేద్కర్ అందరివాడు), నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు (ఆకాశానికే సదావకాశం), డిప్యూటీ కలెక్టర్ తులాల సవరమ్మ (లేత గులాబీ పువ్వుల స్పర్శ), మంగిపూడి శ్రీనివాసరావు (గౌరీ స్తుతి), కుప్పిలి త్రినాథరావు (పుడమి తల్లి), డా.బారువ కోమలరావు (మోక్ష ద్వయాలు పద్య పఠనం), కిల్లాన శ్రీనివాసరావు (సామాజిక చైతన్యం), తోట గోపాలరావు (ఎందరిదీ ఉగాది), బసవ జగన్నాథం (అసలైన గురువు), ఇద్ది పాపయ్య (మహాత్మా పూలే), లోకనాథం సత్యా నందం (రాజ్యాంగ శిల్పి), చోడవరం ఈశ్వరరావు (జైభీం అంబేద్కర్), బగాది వెంకటరావు (మాసిపోని మరక), ఉత్తరావిల్లి నాగేశ్వరరావు (నారాయణ పాట), కె.బాలాజీ, లోకనాథం యశ్వంత్, సోమనాథ్ వంటి వారు పాల్గొని కవితాగానం చేశారు. అనంతరం రచయితలు కొండలరావు, కిల్లాన శ్రీనివాసరావులను సత్కరించారు.

కవులను సత్కరిస్తున్న ప్రతినిధులు

అంబేద్కర్ జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గంజి ఆర్.ఎజ్రా

అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆజ్రా కన్స్యూమర్ ప్రొటెక్షన్ రైట్స్ ఆర్గనైజేషన్ యాక్ట్ అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా ఫలాలు అనుభవిస్తున్న అన్ని వర్గాల వారు కృతజ్ఞతా భావంతో ఉండాలని, బోధించు, సమీకరించు, పోరాడు అన్న అంబేద్కర్ నినాదాన్ని అనుసరిస్తూ ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను ఆచరించిననాడే ఆయన్ని గౌరవించినట్లు అవుతుందన్నారు.

సత్తాచాటిన మోడల్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వావిలపల్లిపేట వద్ద గల ఎపి మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో తమ సత్తాచాటారు. ప్రథమ సంవత్సరం బైపిసిలో ఎం.తేజ 429 మార్కులు, ఎంపిసిలోఎ.పద్మ 452 మార్కులు, సిఇసిలో వై.ఢిల్లీశ్వరి 470 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో ఎస్.శ్రావణి సంధ్య 973 మార్కులు, బైపిసిలో జి.దేవి 969 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ హెచ్ .ప్రభాకర్ తెలిపారు. కాలేజీలో ప్రధానంగా బోటనీలో విద్యార్థులు శతశాతం ఫలితాలతో తన సత్తాను చాటారు. ప్రథమ సంవత్సరం బోటనీ సబ్జెక్టుకు సంబంధించి 28 మంది విద్యార్థులకుగాను 13 మంది విద్యార్థులు 60/60 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 38 మంది విద్యార్థులకుగాను 25 మంది విద్యార్థులు 60/60 మార్కులను సాధించడం గమనార్హం. గతేడాది కూడా బోటనీ సబ్జెక్టులో ప్రథమ సంవత్సరంలో 17 మంది విద్యార్థులు 60/60 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఆరుగురు విద్యార్థులు 60/60 మార్కులను సాధించారు. ఈ విధంగా ఒక ప్రభుత్వ కాలేజీలో ఒక సబ్జెక్టులో ఇంతమంది శతశాతం మార్కులు సాధించడం గొప్ప విషయమంటూ పలువురు బోటనీ ఉపాధ్యాయుడు జి.జీవన్‌బాబును ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నాయకులు

రవికుమార్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఆదివారం కూటమి నాయకులు విశాఖపట్నం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. గత 20 రోజులుగా అమెరికాలోని వివిధ పట్టణాల్లో ఉన్న పలు రంగాల సంస్థలను, యూనివర్సిటీలు, లైబ్రరీలు, ఎన్ఆర్ఐల సమావేశాల్లో పాల్గొని స్వదేశానికి తిరిగి వచ్చారు. అమెరికా పర్యటన ముగించుకొని ఆదివారం ఉదయం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్న ఎమ్మెల్యే రవికుమార్‌కు టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, బగాది రామినాయుడు, సనపల ఢిల్లీశ్వరరావు, నూకరాజు, కూటమి నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.

నిత్యన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో యాత్రికులకు అందిస్తున్న నిత్యాన్నదాన పథక నిర్వహణకు విశాఖ నగరానికి చెందిర విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ చాగంటి సన్యాసిరాజు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఆదివారం సందర్శించి ఆలయ సీనియర్ సహాయకులు ఎ.శోభనాచార్యులు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మలకు అందజేశారు. చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం కావడంతో విశ్రాంత ఐఎఎస్ సుందర్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం అనివెట్టి మండపంలో శేష వస్త్రాలను కప్పి చిత్రపటాన్ని ఆలయ ఇఒ వై.భద్రాజీ అందజేశారు. అరసవల్లి ఆలయానికి ఆదివారం రూ.5.22 లక్షల ఆదాయం సమకూరింది. టికెట్లు రూపేనా రూ2,67,800, విరాళాల రూపంలో రూ.78,417, ప్రసాద విక్రయాల ద్వారా రూ.1,76,465 ఆదాయం సమకూరినట్లు ఇఒ తెలిపారు.

నాటుసారాను అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి- సోంపేట

బేబీ, ఎక్సైజ్ సిఐ

నాటు సారాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని సోంపేట ఎక్సైజ్ సిఐ కె.బేబీ ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1 నుంచి 12 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇతరశాఖల సిబ్బందితో సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఐదు నాటు సారా కేసులను రిజిస్టర్ చేసి తొమ్మిదిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో 68 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. 1800 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. 21 మందిపై నాటుసారా కేసుల్లో బైండోవర్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

కొత్తూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం బైపిసిలో కరక అక్షయ 963, సిఇసిలో లావేటి స్రవంతి 856 మార్కులు, హెచ్ఇసిలో బంటు ఝాన్సీ 753, ఒఎఎస్‌లో కోడూరు శ్రీహరి 950, ఎలండ్‌టి గొర్రె జ్ఞానేశ్వరి 954, ప్రథమ సంవత్సరం ఎంపిసిలో అగదమూడి గీతిక 447 మార్కులు సాధించారు. వీరికి అధ్యాపకులు కోడూరు గోవిందరావు, అదాడ రామరాజు, బోగి లక్ష్మీనారాయణలు ఆదివారం అభినందించారు.

అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రజా ప్రయోజనాల కోసమే కంకర తరలింపు

తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

కళ్యాణచక్రవర్తి, తహశీల్దార్

పలాస: ప్రజా ప్రయోజనాల కోసమే పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం 19వ వార్డు, సూదికొండ సర్వే నంబరు 51లో ఉన్న కంకరను తరలిస్తున్నామని, ఇందులో ప్రజలు ఎటువంటి అపోహలు పడవద్దని తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో కోరారు. పలాస-కాశీబుగ్గ పట్టణ ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు, పర్యావరణ ప్రేమికులు ఎటువంటి అపోహలు పడవద్దని అన్నారు. పురుషోత్తపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని ఫిబ్రవరి నెలలో కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి గుర్తించిన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను ప్రజా ప్రయోజనాల నిమిత్తం తొలగించామన్నారు. సదరు ఆక్రమణలు తొలగించిన స్థలంలో ఎత్తు, పల్లములు ఉండడం వల్ల వాటిని సమాంతరంగా చేశామన్నారు. అడ్డుగా కొండ దిగువున ఉన్న కంకర దిబ్బను తొలగించి గుర్తించిన స్థలం మొత్తం ఏకరీతిగా ఉండేటట్టు, కేంద్రీయ విద్యాలయ కమిటీ పరిశీలకులకు గుర్తించిన స్థలం వారికి సంతృప్తికరంగా ఉండేటట్టు జిల్లా యంత్రాంగం తగుచర్యలు తీసుకుందన్నారు. దీంతో ఆ స్థలం మొత్తం చదును చేస్తున్నామని తెలిపారు. కంకరను ఎంఐజి లేఅవుట్ అభివృద్ధి పనులకు తప్ప మరి ఏ ఇతర అవసరాలకు వాడకూడదని ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

సత్కారం అందుకుంటున్న ఈవేమన

ఈవేమనకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి- రణస్థలం

ప్రముఖ రచయిత, కవి, వేమన కవితామయం వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ రఫీ (ఈవేమన)ను పార్వతీపురం సూర్యపీఠం సమావేశ మందిరంలో సాహితీ లహరి, మంచిపల్లి సేవాసంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఉగాది పురస్కార సాహిత్య కార్యక్రమం అనంతరం కవి సమ్మేళనంలో సాహితీ లహరి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు బాలసాహిత్యం కేంద్ర బాలసాహిత్య పురస్కార గ్రహీతలు నారంశెట్టి ఉమా మహేశ్వరరావు, బెలగాం భీమేశ్వరరావు, కవి జాషువా పురస్కార గ్రహీత గంటేడ గౌరునాయుడు, కార్యక్రమ నిర్వాహకుడు మంచిపల్లి సారథిలు సత్కరించినట్లు పేర్కొన్నారు.

తిరుమలరావుకు...

కొత్తూరు: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, మండలంలోని పాతపొన్నుటూరు ఎంపియుపి పాఠశాలలో సాంఘిక శాస్త్రోపాధ్యాయునిగా పనిచేస్తున్న కుదమ తిరుమలరావు మరో సన్మానం ఆదివారం స్వీకరించారు. కవిసమ్మేళనానికి ఎంపికైన తన స్వీయ గీతాలను ఆలపించి ఈ ఘన సన్మానాన్ని అందుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని భారత సామ్రాజ్యాలపై తిరుమలరావు స్వీయ గీతాన్ని ఆలపించి అందరి అభినందనలు పొందారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండు వేసవిలో బాటసారులకు, ప్రజలకు చలివేంద్రాలు ఎంతో మేలు చేస్తాయని అందువలన స్వచ్ఛంద సంస్థలు ఇటువంటివి ఏర్పాటు చేయడం వలన పలువురికి మేలు చేకూర్చే వారమవుతామని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు అన్నారు. ఆదివారం శ్రీ సత్యసాయి సేవా సమితి, వేణమ్మపేట, అక్కులపేట ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని అక్కులపేట బస్‌షెల్టర్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చలివేంద్రాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఆదివారం మజ్జిగ దాత జిల్లా జాయింట్ యూత్ కో-ఆర్డినేటర్ బనిశెట్టి సాయికృష్ణ అందించారన్నారు. కార్యక్రమంలో జోనల్ యూత్ కో-ఆర్డినేటర్ పవన్, సమితి యూత్ కో-ఆర్డినేటర్ గోవింద్, మన్మథ మాస్టార్, ఉప్పు సంతోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మజ్జిగను పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవాకమిటీ సభ్యులు

ఇచ్ఛాపురం : మజ్జిగను పంపిణీ చేస్తున్న రాజు

మజ్జిగ కేంద్రం ప్రారంభం

ఇచ్ఛాపురం : మండలంలో లొద్దపుట్టిలో ధనరాజ్ తులసమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆదివారం ప్రారంభించారు. ఏటా తులసమ్మ ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. అనంతరం యాత్రికులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తిప్పన సురేష్‌రెడ్డి, మాధవ్, రోకళ్ల భాస్కరరావు, ప్రేమ్‌కుమార్, కలియగౌడ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టుకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎపి టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం కంచిలిలో నిర్వహించిన జిల్లాస్థాయి మేధా టాలెంట్‌కు స్పందన లభించిందని నిర్వాహకలు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన జిల్లాస్థాయి పరీక్షకు 133 మంది పిల్లలు పాల్గొన్నారు. మొదటి స్థానాన్ని రాణి నాయక్, రెండో స్థానాన్ని రుద్ర మాధవ్, మూడో స్థానాన్ని తరుణ్ బెహరా కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒలు శివరాంపసాద్, చిట్టిబాబు, అపోట కేంద్ర కమిటీ అధ్యక్షుడు భాస్కర్ పాడి, కేంద్ర కమిటీ సభ్యులు సుదర్శన బెహరాల చేతుల మీదుగా బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కంచిలి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గాప్రసాద్, భాగీరథి నైకో, సహ దక్షులు త్రినాథ్ సాహు, కోశాధికారి గోపబందు గౌడో, ఉపాధ్యాయులు ఎన్.రవి, షణ్ముఖరావు వై.శంకరరావు, కామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విజేతలతో అపోటా ప్రతినిధులు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

'జ్ఞానజ్యోతి' ప్రభంజనం

నరసన్నపేట: ఇంటర్ ఫలితాల్లో నరసన్నపేటలో జ్ఞాన జ్యోతి కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ వరుధు ప్రవీణ ఆదివారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఎంపిసిలో ధర్మాన యుగంధర్ 464, పట్ట కృష్ణ 460 మార్కులు సాధించారని అన్నారు. బైపిసిలోమ పి.నీరజ 431, యాల్ల ధరణి 429 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో యాజమాన్యం ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

తొలగిన ఆక్రమణలు.. మరచిన పూడికలు

● తప్పని సాగునీటి ఇబ్బందులు

● ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని ఆరోవార్డు పరిధిలోని కాళింగ మన్న్యయ్యపేటలోని చొక్కాకుల బంధ ఆక్రమణలు తొలగించి చెరువులోని పూడికలను మరిచారని సాగు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చొక్కాకుల బంధ సర్వే నెంబర్ 290లో 5 ఎకరాల 60 సెంట్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. గతంలో చెరువు ఆక్రమణకు గురైన సందర్భంలో ప్రజాశక్తిలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించారని, అయితే పూడికలను తొలగించడం మరిచారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించే సమయంలో వర్షాలు పడడంతో ఆ తరువాత పూడికలు తీస్తామని అధికారులు చెప్పారని, నేటికి తొలగించలేదని రైతులు వాపోతున్నారు. చొక్కాకుల బంధ చెరువు కింద సన్న, చిన్న కారు రైతులు భూములను సాగు చేసుకుంటున్నామని పూడికలు తొలగించకుంటే సాగు కష్టమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు జిల్లా కేంద్రంలో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ తమ సమస్యకు పరిష్కారం లభించలేదని రైతులు వాపోతున్నారు. అధికారులు పూడికలు తొలగించకుంటే రైతులందరం కలిసి కొంత మొత్తంలో డబ్బులను సేకరించి పూడికలు తొలగించుకుంటామని, జిల్లా అధికారులు అనుమతులు మంజూరు చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పూడికలు తీయకుండా ఉన్న చొక్కాకుల బంద

12వ పిఆర్‌సి ప్రకటించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

12వ పిఆర్‌సిని ప్రకటించి ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలోని ఓ పాఠశాలలో సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పెన్షనర్లకు నష్టం చేకూర్చే బిల్లును వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ మాట్లాడుతూ చనిపోయిన పెన్షనర్ల కుటుంబాలకు దహన సంస్కారాల ఖర్చులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ సభ్యులు ఆర్.సత్యనారాయణ, కె.షణ్ముఖరావు, పి.బానోజీరావు, బి.వి రమణ, కె.జనార్దనరావు, కె. సంజీవరావు, బెండి నారాయణరావు, చిట్టయ్య, బలివాడ వెంకటరమణ, కోటేశ్వరరావు, వాసుదేవరావు, కృష్ణమూర్తి, బి.వి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

25 మంది రక్తదానం

ఇచ్ఛాపురం : రోటరీ క్లబ్, ఉద్దానం బ్లడ్ సెంటర్ ఆధ్వర్యాన ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎం.రాజ్‌కుమార్, కార్యదర్శి పి.దినేష్, ప్రాజెక్టు చైర్మన్ డాక్టర్ వేదవ్యాస్ పర్యవేక్షణలో ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. వేసవిలో అనేక రుగ్మతలు వచ్చే అవకాశం ఉంటుందని, అవసరమైన బాధితులకు రక్తదాన శిబిరం వల్ల ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఈ మేరకు 25 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో పి.తులసీదాస్‌రెడ్డి, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, శ్యామ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌చౌదరి, ప్రదీప్, గోపాల్, ఎం.నవీన్, కిరణ్, ఎస్.పృథ్వీ పాల్గొన్నారు.

వైభవంగా ఉయ్యాల వేడుక

శ్రీకాకుళం : శ్రీకాకుళం మండలం సింగుపురం ఉమా హటకేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఉయ్యాల వేడుక కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకల్లో స్థానికులతో పాటు ఎమ్మెల్యే గొండు శంకర్ ఎర్రని వస్త్రాలు ధరించి సందడి చేశారు. ఆయనతో పాటు స్థానికులు ఆటపాటలతో జత కలిపారు.

స్మృతివనాన్ని వ్యాపార కేంద్రంగా మార్చొద్దు

ప్రజాశక్తి- నందిగాం

విజయవాడ మహానగరంలోని స్వరాజ మైదానంలో గత సంవత్సరం జనవరి 19న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతి వనం రూ.404 కోట్లతో 19 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పడం ఆంధ్రాకు తలమానికమని దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పుడు అంబేద్కర్ స్మృతి వనాన్ని పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ పద్ధతిలో ప్రభుత్వం టెండర్లకు ఆహ్వానించడం తగదన్నారు. స్మృతి వనాన్ని వ్యాపార కేంద్రంగా మార్చి అంబేద్కర్‌ను అవమానించొద్దని అన్నారు. అంబేద్కర్ జయంత్యుత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విరమించుకోకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

సత్కరిస్తున్న దాసరి రాజు

సత్యవరప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

మృదంగ విద్వాంసుడు, ఉగాది పురస్కార గ్రహీత ప్రొఫెసర్ బొంతలకోటి సత్యవరప్రసాద్‌కు కుసుంపురానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం, గ్రామంలోని జన సైనికులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ – జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యాన ఆత్మీయ సత్కారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు, సింధుల మోహనరావు, అంగ సురేష్ మాట్లాడుతూ సత్యవరప్రసాద్ మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జన సైనికులు, స్థానిక మాతమూర్తి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మానవహారం నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆదివారం గుడ్ ఫ్రైడేకి ముందు వచ్చిన ఆదివారం యొక్క ప్రత్యేకతను తెలియజేస్తూ మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న బైబిల్ మిషన్ చర్చ్ ఆధ్వర్యంలో పాస్టరు ఆర్. శ్యామ్, రాడ విజయ్‌కుమార్ సువార్తను ప్రకటించారు. కార్యక్రమంలో రామారావు, లక్ష్మణ, రాజు, రాజేష్, ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం బాప్టిస్టు చర్చి ఆధ్వర్యాన మట్టలా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు.. బాప్టిస్టు చర్చ్ విశ్వాసాలు, సండే స్కూల్ విద్యార్థులతో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చ్ ప్రెసిడెంట్ ప్రత్తి విజయకుమార్, లక్ష్మణ్‌రావు, దిలీప్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

టెక్కలి రూరల్ : టెక్కలి అంబేద్కర్ కూడలి నుంచి బన్నువాడ రోడ్డు కూడలి వరకు రద్దీగా ఉంటుంది. ప్రాంతం కొంత మంది సంఘ నాయకులు అండదండలతో కావాలనే రోడ్డుపైనే దౌర్జన్యంగా వ్యాపారాలు వస్తువులను పెడుతున్నారు. దీంతో వినియోగదారుల ద్విచక్ర వాహనాలు రోడ్డుపై పెట్టి సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ఈ తరుణంలో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ప్రభుత్వం స్పందించి విస్తరణకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిలిచిన వాహనాలు

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఉద్యమాలు అనివార్యం

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- పలాస

అసమానతలు ఉన్న సమాజంలో ఉద్యమాలు అనివార్యమని, కగార్ పేరుతో మావోయిస్టుల నిర్మూలన అసాధ్యమని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. పలాసలోని కళ్యాణ మండపంలో జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు, న్యూడెమోక్రసీ నేత కే.శే పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వాసుదేవరావు ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఒడిశా రాష్ట్ర సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బాలచంద్ర షడంగీ మాట్లాడుతూ పాలకులు కార్పొరేట్లకు వత్తాసుగా నిలుస్తున్నారని అన్నారు. ఎపి అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ విప్లవ అనుభూతిపరులు మైదాన ప్రాంతంలో వేలాదిమంది ఉన్నారని అన్నారు. రాష్ట్ర కమిటీ నాయకులు వై.కొండయ్య మాట్లాడుతూ లక్షల కోట్ల అప్పులతో ఈ దేశాన్ని ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. పేదలను మరింత పేదలుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆద్యంతం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు విప్లవగీతాలాపన, నృత్యప్రదర్శనలు చేసి సభను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఎం.వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమణి, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గొరకాల బాలకృష్ణ పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు వందన సమర్పణ చేశారు.